క్లుప్తంగా

ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ సూచించారు. ఆర్మూర్ పట్టణంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికి తిరిగి సర్వే చేసి క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దగ్గు, దమ్ము ఎక్కువగా ఉన్న వారు కచ్చితంగా టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయితే వారికి 6 నెలలు పూర్తి ఉచితంగా మందులు ఇస్తామన్నారు.

లింబాద్రి గుట్ట ఆదాయం రూ.8.10 లక్షలు

మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలో ఉన్న ప్రసిద్ధ లింబాద్రి గుట్ట హుండీ ఆదాయం రూ.8.10లక్షలని దేవాదాయ శాఖ అధికారులు ప్రకటించారు. ఆలయ ట్రస్టీ, దేవాదాయ శాఖలు సంయుక్తంగా ఆలయంలోని హుండీ, అన్నదాన సత్రంలో ఉన్న హుండీని తెరిచి లెక్కించి వివరాలను వెల్లడించారు. ఆలయానికి చెందిన బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయనున్నారు.

విత్తన విక్రయ కేంద్రాల తనిఖీ



వేల్పూర్: మండలంలో విత్తన విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయాధికారి శృతి, ఎస్సై సంజీవ్ గురువారం సంయుక్తంగా తనిఖీ చేశారు. లైసెన్సు, స్టాక్ రిజిస్టరు, బిల్ బుక్కులు, విత్తన నిల్వలు, ఇతర రికార్డులు పరిశీలించారు. నాణ్యత కలిగిన విత్తనాలు అమ్మాలని, కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని, సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



డొంకేశ్వర్(ఆర్మూర్): అనారోగ్యంతో మరణించిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. డొంకేశ్వర్ మండలం చిన్నయానంకు చెందిన బాలరాజ్ ఇటీవల మరణించారు. పేద కుటుంబం కావడంతో బాలరాజ్‌తో కలిసి చదువుకున్న 2022–03 బ్యాచ్ స్నేహితులు డబ్బులు పోగు చేశారు. రూ.31వేల నగదును బాలరాజ్ భార్యకు గురువారం అందజేశారు.

మురికి కాలువల్లో పూడిక తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో మురికి కాలువల్లో పూడిక పేరుకుపోవడంపై 'సాక్షి' దిన పత్రికలో బుధవారం 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. స్పందించిన బాల్కొండ పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. మురికి కాలువలో చెత్తను పడవేయవద్దని కాలనీవాసులకు పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి సూచించారు.

మొబైల్ ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పోయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి గురువారం బాధితులకు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి ఏడుగురు బాధితులకు అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఉత్తమ నాట్య గురువు పురస్కారానికి ఎంపిక



బాశెట్టి మృణాళిని

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణానికి చెందిన నటరాజ నృత్యనికేతన్ నాట్య గురువు డాక్టర్ మృణాళిని 2025 ఏడాదికి గాను ఉత్తమ నాట్య గురువు గా ఎంపిక చేసినట్లు గురువారం శ్రీరాజ్ డాన్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ, భారతీయ కళా వైభవం నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని భారతీయ కళా వైభవం వేదికపై ఆర్మూర్ పట్టణానికి చెందిన నట రాజ నృత్య నికేతన్ చిన్నారులు నాట్యంలో చక్కని ప్రతిభను కనబర్చి కళా భారతి పురస్కారాలను అందుకున్నారు. చిన్నారులను నాట్యంలో ఉత్తమంగా తీర్చిదిద్దినందుకు అవార్డును ప్రదానం చేసామన్నారు.

మూడేళ్లయినా ముహూర్తం కుదరలే!

- శిథిలావస్థలో చిన్నయానం జీపీ కార్యాలయం
- నిధులు మంజూరైనా నిర్మాణ పనులు ప్రారంభించని అధికారులు



చిన్నయానం జీపీ కార్యాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని చిన్నయానం జీపీ కార్యాలయం శిథిలావస్థలోనే కొనసాగుతోంది. కొత్త భవనం కోసం ప్రభుత్వం మూడేళ్ల క్రితం నిధులు మంజూరు చేసినా ఇంత వరకు పనులు చేపట్టేందుకు ముహూర్తం కుదరలేదు. కారణం స్థల సమస్య కొలిక్కి రాకపోవడమే. 2023 జూన్‌లో మండలంలో ఐదు కొత్త గ్రామ పంచాయతీ భవనాలు ఉపాధిహామీ పథకం కింద మంజూరయ్యాయి. అందులో చిన్నయానం కూడా ఉంది. ఒక్కో జీపీకి రూ.20లక్షలు మంజూరు కాగా చిన్నయానంలో జీపీ బిల్డింగ్ పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. మూడు చోట్ల స్థలాన్ని చూసినా ఎక్కడనేది ఫైనల్ కాలేదు. దీంతో పంచాయతీరాజ్ అధికారులు పనులు ప్రారంభించలేపోతున్నారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనంలోనే పంచాయతీ కార్యాలయం కొనసాగుతుండగా వర్షానికి ఊరుస్తోంది. పంచాయతీ కార్యదర్శితో పాటు పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్థల సమస్యను పరిష్కరిస్తాం



ఊరిలో జీపీ భవనం కొత్తది కట్టేందుకు మూడు చోట్ల స్థలాన్ని చూశాం. గ్రామ పెద్ద మనుషులతో మాట్లాడి త్వరలోనే స్థల సమస్యను పరిష్కరిస్తాం. ఆ వెంటనే అధికారులు పనులు ప్రారంభించాలని కోరుతాం.
– ఎర్ర శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధి, చిన్నయానం

నిరుపయోగంగా పాఠశాల భవనం



నందిపేటలోని పాఠశాల భవనం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో 20 ఏళ్ల కిందట రూ.20 లక్షలతో నిర్మించిన బాలికల ఉన్నత పాఠశాల భవనం దశాబ్ద కాలంగా నిరుపయోగంగా ఉంది. గ్రామానికి దూరంగా చెరువు ప్రాంతంలో నిర్మించడంతో బాలికలు వెళ్లడానికి నిరాకరించడంతో బాలికల పాఠశాలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు మార్చారు. దాంతో అప్పటి నుంచి భవనం వృథాగా ఉంటుంది. కొంతకాలం తాత్కాలికంగా పాలిటెక్నిక్ సాంకేతిక కళాశాలకు వాడుకున్నారు. తర్వాత పాలిటెక్నిక్ కళాశాల సొంత భవనానికి మారిపోవడంతో వృథాగా మారింది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలప్పుడు ఈ భవనాన్ని అధికారులు ఉపయోగించుకుంటున్నారు తప్ప పూర్తి స్థాయిలో ఉపయోగంలో లేదు. నిర్మానుష్యమైన చోట ఉండడంతో ఆకతాయిలు, మందుబాబులు, పేకాటరాయుళ్లకు అడ్డాగా మారింది. భవనం కిటికీలు, తలుపులు దొంగలు ఎత్తుకెళ్లారు. వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన



బోధన్‌టౌన్(బోధన్): మున్సిపాలిటీలో అమృత్ 2.0. పథకంలో భాగంగా రాకాసిపేట్‌లోని ప్రెస్ కాలనీలో, బీటీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న తాగునీటి ట్యాంకుల నిర్మాణ స్థలాలను సబ్‌కలెక్టర్ వికాస్ మహతో గురువారం పరిశీలించారు. బల్దియా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రెస్ కాలనీలో 700 కె.ఎల్ కెపాసిటీతో, బీటీ నగర్ కాలనీలో 600 కె.ఎల్ కెపాసిటీ గల ట్యాంకులను నిర్మించనున్నారు. తహసీల్దార్ విఠల్ ఉన్నారు.

త్వరలో సమీకృత పాఠశాల ఏర్పాటు



ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి, ఇతర నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లో త్వరలో రూ.200 కోట్లతో సమీకృత పాఠశాలను ఏర్పాటు చేయబోతున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి వెల్లడించారు. పెర్కిట్‌లో గురువారం పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఆలూర్, ఆర్మూర్ తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ మున్ను, నాయకులు పండిత్ పవన్, మారుతి రెడ్డి, పూల నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి



బోధన్‌టౌన్(బోధన్): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ(బోధన్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పసులోటి గోపి కిషన్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో తిరంగా ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజుల దేవి పవన్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ప్రీతం గౌడ్, నాయకులు వాసు లింగం తదితరులున్నారు.

ఆర్మీ జవాన్, ఆదర్శ రైతుకు సన్మానం



రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ క్యాంపులోని గుమ్మడి ఫౌండేషన్ అనాథాశ్రమంలో గురువారం కోటగిరి టీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జై జవాన్..జై కిసాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మీ జవాన్‌గా సేవలందించిన రవీంద్ర బాబు దంపతులను, ఆదర్శ రైతు సూర్య ప్రభాకర్ చౌదరి దంపతులను ఫౌండేషన్ చైర్మన్ తాటి వీరేశం, తాటి లత ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశానికి సైనికులు, అన్నదాతల చేసిన సేవలు ఎంతో విలువైనవని అన్నారు. అలాగే గ్రామంలో 20 ఏళ్ల క్రితం రామాలయాన్ని నిర్మించిన దంపతులను ఈ కార్యక్రమంలో సత్కరించారు.రిటైర్డ్ విద్యాశాఖ ఉద్యోగులు నర్సింహారావ్, నాగేశ్వర్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి ట్రాక్టర్ గట్టి పని..



బాల్కొండ: పిట్టం కొంచెం కూత ఘనం అన్నట్లుగా ఉంది మెండోరా మండలం బుస్సాపూర్‌లో పొట్టి ట్రాక్టర్లు చేసే పని. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా చిన్న ట్రాక్టర్‌తో పసుపు పంట విత్తటానికి బోయను వేస్తూ పసుపు పంటను విత్తుతున్నారు. ట్రాక్టర్ చిన్నగా ఉండటంతో బరువు తక్కువ ఉండటం వల్ల నేల తేమ శాతం ఉన్నప్పటికీ సులువుగా బోయా వేస్తుందని రైతులు అంటున్నారు.

పాలాభిషేకం



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంద కృష్ణ.. పద్మశ్రీ అవార్డు పురస్కారాన్ని పొందినందుకు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఎమార్పీఎస్ నేతలు సోంపూర్ పోచిరాం, హస్గుల్ శ్రీకాంత్, కన్నం శ్రీనివాస్, జెండా దినేష్, విజయ్, దవులయ్య, సాయిలు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు..



రుద్రూర్: పోతంగల్ బస్టాండ్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పోతంగల్ మండలానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌వోసీ అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణానికి చెందిన గాండ్ల జీవన్ కుటుంబ సభ్యులకు గురువారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి రూ.2 లక్షల 50 వేల ఎల్‌వోసీని అందజేశారు. పట్టణానికి చెందిన రాంచందర్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. చికిత్సలకు అయ్యే వ్యయాలను వినయ్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేయించారు.

నేటి నుంచి కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికలు

రెంజల్(బోధన్): నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో శుక్రవారం నుంచి సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్ ఖాన్ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడితో పాటు ఇతర కార్యవర్గాలను ఈ నెల 2 వరకు పూర్తి చేయాలని అన్నారు. 30న బాగేపల్లి, కూనేపల్లి, కళ్యాపూర్, దండిగుట్ట, దూపల్లి, 31న తాడ్‌బిలోలి, బోర్గాం, కందకుర్తి, పేపర్‌మిల్, నీలా, సాటాపూర్, జూన్1న వీరన్నగుట్ట, వీరన్నగుట్టతండా, రెంజల్, అంబేడ్కర్‌నగర్, కిసాన్‌తండా, మౌలాలితండాలలో గ్రామ కమిటీ ఎన్నికలను నిర్వహించాలని సూచించారు.

సంక్షిప్తం

పశువులకు టీకాలు

మాక్లూర్: మండల కేంద్రంలో పశువులకు టీకాలు వేశారు. ఆవులకు డొబ్బవాపు, గేదెలకు గొంతువాపు, గొర్రెలకు చిటుకు వ్యాధులు సోకి అవస్థలు పడకుండా ఈ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారులు ఉమా సహేర్, కిరణ్‌దేశ్‌పాండేలు తెలిపారు.

రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి



కమ్మర్‌పల్లి: జిల్లా కేంద్రంలో జూన్ 21, 22 తేదీలలో జరిగే ట్రేడ్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.ముత్తెన్న, రమేష్‌లు పిలుపునిచ్చారు. గురువారం హసాకొత్తూర్‌లో మహా సభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. నాయకులు సత్తెమ్మ, రాజేశ్వర్, గంగాధర్, బాలయ్య, బషీర్, నర్సయ్య, కిషన్, రాజన్న పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ శ్రీరామ కాలనీలో గురువారం ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రైస్ బ్యాగ్ చాలెంజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనాథలు, యాచకులు, దివ్యాంగుల ఆకలి తీరుస్తున్న సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. అనంతరంతనవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ చైర్మన్ సాయిబాబాను సన్మానించారు. బాశెట్టి మృణాళిని, ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం ముచ్కూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ నిర్వహించారు. ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ లబ్ధిదారులుగా ఎంపికైన వారికి మంజూరు పత్రాలను అందించారు. నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. గురువారం ఆర్మూర్ కోర్టు ఆవరణలో సామాజిక సేవకుడు తులసి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ సంరక్షణలో అందరం ముందుండాలని పిలుపునిచ్చారు.

ప్రతిభా పురస్కార కరపత్రాల ఆవిష్కరణ

వేల్పూర్: పడగల్‌లో విశ్వకర్మ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో అందించే ఎస్సెస్సీ ప్రతిభా పురస్కారాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు గద్దె గంగాధర్ మాట్లాడుతూ.. ఆర్మూర్ డివిజన్‌లో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విశ్వకర్మ విద్యార్థులు ఈనెల 31లోగా ఆన్‌లైన్ మెమో, ఆధార్‌కార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు 9490006312, 9440036459, 9704788075 నంబర్లకు వాట్సాప్ చేయాలన్నారు. మండలానికి ఇద్దరు చొప్పున ప్రథమ, ద్వితీయ అవార్డులను వచ్చే నెల 1న ఆర్మూర్‌లో అందజేస్తామని వెల్లడించారు.

ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమావత్

నిజామాబాద్‌నాగారం: ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమావత్ మోహన్ నాయక్, కార్యదర్శిగా కేతావత్ పీర్‌సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీహరి నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఇందులో మాజీ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, విఠల్‌నాయక్, శంకర్‌నాయక్, బన్సీ నాయక్, ఇందల్‌నాయక్, రాజశేఖర్, గౌతమ్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు



బుస్సాపూర్ నుంచి మెండోరా వెళ్లే రోడ్డులో ఉన్న వ్యవసాయ బావులు

- రక్షణ చర్యలు శూన్యం
- గతంలో బావిలో ఆటో పడి 11 మంది జల సమాధి

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ నుంచి మెండోరా మండల కేంద్రం వరకు గల రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. బావుల పక్కన ఎలాంటి రక్షణ గోడలను ఏర్పాటు చేయలేదు. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. రెండేళ్ల క్రితం రోడ్డు వెడల్పు కావడంతో వ్యవసాయ బావులు రోడ్డుకు మరింత దగ్గరగా వచ్చాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల బావులు ప్రస్తుతం నిండుగా మారాయి. పొరపాటున ప్రమాదం సంభవిస్తే ప్రాణాలు నీటిలో కలిసి పోతాయి. గతంలో మెండోరా కేంద్ర శివారులో గల వ్యవసాయ బావిలోకి ఆటో దూసుకెళ్లి 11 మంది జల సమాధి అయ్యారు. అధికారులు స్పందించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అక్రమ కేసులకు భయపడం



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలు

బాల్కొండ: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నేత జోగు నర్సయ్యపై అక్రమ కేసులు బనాయించటానికి కుట్రలు చేస్తున్నారంటూ ఆయనకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత సునీల్‌రెడ్డి చేస్తున్న అక్రమ దందాల గురించి సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టటానికి పోలీసులతో సునీల్ రెడ్డి నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. బాల్కొండ, ముప్కాల్ మండలాల అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



మాక్లూర్: ప్రకృతివనాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

నవీపేట/నందిపేట/మాక్లూర్/డొంకేశ్వర్: నవీపేట మండలం జన్నేపల్లిలో, నందిపేట మండలం ఆంధ్రానగర్‌లో, మాక్లూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం కేంద్ర సర్వీస్‌లోని వివిధ శాఖల ప్రతినిధులు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి గ్రామంలో అందుతున్న కేంద్ర ప్రభుత్వ వైద్య సేవలపై ఆరా తీశారు. 2018 నుంచి అందించిన కోవిడ్ వ్యాక్సిన్‌పై విచారించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఐకేపీ, ఐసీడీఎస్, విద్య, వైద్యం, వ్యవసాయ శాఖల పనితీరు గురించి తెలుసుకున్నారు. అలాగే గ్రామస్థాయిలో పరిపాలన గురించి విచారించారు. ప్రకృతివనాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం డొంకేశ్వర్ మండలం చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దుర్వాసనతో చదువుకునేదెట్లా..?

- ప్రభుత్వ కళాశాల పక్కనే చెత్త
- కోళ్ల వ్యర్థాలు వేస్తున్న స్థానిక చికెన్ వ్యాపారులు
- కంపు కొడుతోందని విద్యార్థుల ఆవేదన



బాల్కొండ ప్రభుత్వ కళాశాల పక్క గ్రౌండ్‌లో వేసిన కోళ్ల వ్యర్థాలు

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన గ్రౌండ్‌లో నిత్యం అనేక వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో కళాశాలలోకి దుర్వాసన వస్తోంది. రెండు సంవత్సరాలుగా ఈ తిప్పలు తప్పడం లేదు. పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేయగా తొలిగించారు. మళ్లీ రెండు రోజులు గడవక ముందే చెత్త కుప్పలా తయారవుతుంది. చెత్త మాత్రమే కాకుండా కోళ్ల వ్యర్థాలను కూడా వేస్తున్నారు. చికెన్ వ్యాపారులను చూసి కొందరు జంతు కళేబరాలను తీసుకువచ్చి పడేస్తున్నారు. ఈ కారణంగా నిత్యం కళాశాలలోకి దుర్వాసన వస్తోంది. దుర్వాసనతో చదువుకోలేక పోతున్నామని, మరో నాలుగు రోజుల్లో కళాశాల ప్రారంభం కాబోతుందని.. ఆ లోపు ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.

వినియోగదారులకు తిప్పలే..

బాల్కొండ ప్రభుత్వ కళాశాల పక్కన గల గ్రౌండ్‌లో ప్రతి గురువారం సంతను నిర్వహిస్తారు. పక్కన చెత్త, వ్యర్థాలు ఉండటంతో వినియోగదారులకు కూడా తిప్పలు తప్పడం లేదు. కంపును భరించలేకపోతున్నామంటూ పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు తగ్గగానే తొలగిస్తాం

చెత్తపై వర్షాలు కురువడంతో ప్రస్తుతం తీయటానికి వీలు లేకుండా పోయింది. కొద్దిగా ఎండ తగలగానే చెత్తను తొలగింపజేస్తాం. ఇది వరకే మా దృష్టికి వచ్చింది. కాలేజ్ ప్రారంభమయ్యే లోపు శుభ్రం చేయిస్తాం. – రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) - 10.55, 7.20, కరాటే కిడ్ లీడర్స్-2.25 భూల్ చుక్ మాఫ్(హిందీ) - 4.40, 10.50
స్క్రీన్-2	భూల్ చుక్ మాఫ్(హిందీ)-11.00 సింగిల్-1.40, 7.35, భైరవం-4.25,10.20
స్క్రీన్-3	కరాటే కిడ్ లీడర్స్-11.25, షష్టిపూర్తి-1.40, సింగిల్-4.50 కరాటే కిడ్ లీడర్స్(ఇంగ్లీష్) -7.45, 10.00
స్క్రీన్-3	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-11.05, 4.15, 10.20, శుభం-1.35, ఖలేజా-6.45



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్